

తూనికలు, కొలతల హైదరాబాద్ సిటీ కంట్రోలర్ సిద్ధార్థకు వినతి పత్రం అందజేస్తున్న వినియోగదారుల హక్కుల సంస్థ అధ్యక్షుడు హరిబాబు

## దోచుకుంటున్న సినిమా థియేటర్లు

కవాడిగూడ, డిసెంబర్ 20 : ఆహ్లాదం కోసం సినిమాలు చూడడానికి వచ్చే వినియోగదారును ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని థియేటర్ల యాజమాన్యాలు దోచుకుంటున్నాయని వినియోగదారుల హక్కుల సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి హరిబాబు ఆరోపించారు. కూల్‌డ్రింక్స్, ఇతర తిను బండారాలను ఎమ్మార్పీ రేట్ల కంటే అధికంగా విక్రయిస్తున్నారని, దీనిపై పూర్తి సాక్ష్యాదారాలతో సహా ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని దేవీ 70ఎంఎం థియేటర్‌పై డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ మెట్రాలజీ హైదరాబాద్ సిటీ కంట్రోలర్ కె.సిద్ధార్థ కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు బుధవారం ఆయన తెలిపారు. దీంతో స్పందించిన ఆయన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల హక్కుల సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడపర్తి శివకుమార్, వల్లాల రవియాదవ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాసు రాజు, గ్రేటర్ ఉపాధ్యక్షుడు తాండ్ర రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## 6 గ్యారెంటీలకు మంగళం పలికేందుకే శ్వేతపత్రం నాటకం

- సాట్స్ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్

హైదరాబాద్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం శాసన సభలో శ్వేతపత్రం పేరుతో దుశ్శాసన పర్వానికి తెరలేపిందని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ ఆంజనేయ గౌడ్ అన్నారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ పాలనా వివక్ష ఉరికొయ్యకు తరాలపాటు వేలాడి, జీవచ్ఛవంలా మారిన తెలంగాణ రాష్ట్రాన్ని తల ఎత్తుకునేలా చేసేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పడిన కష్టం తలకిందులుగా తపస్సు చేసినా కాంగ్రెస్ పాలకులకు అర్థంకాదన్నారు. మసిహస్తాలతో శ్వేతపత్రం ప్రవేశపెట్టిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వ పరువును వివస్త్రను చేసే దుశ్శాసన సర్కారుగా మారిందని ఆరోపించారు. రేవంత్ రెడ్డి సర్కార్ అప్పుల పేరు చెప్పి ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నదన్నారు. గ్యారెంటీలకు మంగళం పాడేందుకు, హామీల అమలును వాయిదా వేసేందుకు రేవంత్ రెడ్డి శ్వేతపత్రం నాటకం మొదలు పెట్టారని ఆరోపించారు.



## పరిణతవాణి ప్రసంగాల పదవ సంపుటి ఆవిష్కరణ

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 20 : తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రచురించిన పరిణతవాణి ప్రసంగాల పదవ సంపుటిని పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి బుధవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. పరిషత్తు ట్రస్టు కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, కోశాధికారి మంత్రి రామారావు, సభ్యులు సి.వసుంధర రెడ్డి, ఆచార్య ఎస్వీ రామారావు పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్, వన్‌టైమ్ గ్రాంట్ పెంపు

సిటీబ్యూరో, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ లా గ్రాడ్యుయేట్లకు ఎస్సీ అభివృద్ధి శాఖ నుంచి ఆర్థిక సాయం అందించే కార్యక్రమంలో భాగంగా స్కాలర్‌షిప్‌లు, వన్‌టైమ్ గ్రాంట్‌ను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో గతంలో ఉమ్మడి జిల్లాకు ఎనిమిది సీట్లు మాత్రమే ఉండేవి. కాని ఇక నుంచి శాచురేషన్ పద్ధతిలో అర్హతలు ఉన్న వారికి ఈ పథకాన్ని వర్తింపచేయనున్నారు. ఎస్సీ, లా గ్రాడ్యుయేట్లకు మూడు సంవత్సరాలకు స్టైఫండ్ రేటును నెలకు రూ.1000 నుంచి రూ.3000 పెంచారు. డిజిటల్ పుస్తకాలు, కంప్యూటర్, ఫర్నీచర్, లాయర్ డ్రెస్ కోసం ఒకసారి గ్రాంట్‌గా ఒక్కో అభ్యర్థికి గ్రాంట్ రూ.6000 నుంచి రూ.50 వేలకు పెంచారు. బార్ కౌన్సెల్‌లో నమోదు రుసుంను రూ.585 నుంచి బార్ కౌన్సెల్ వసూలు చేసే వాస్తవ రేటుకు పెంచారు. అయితే అర్హతలు ఉన్న లా గ్రాడ్యుయేట్లకు 'అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్'లో శిక్షణ ఇవ్వడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. దరఖాస్తుదారుడు 34 ఏండ్లలోపు ఉండాలన్నారు, తల్లిదండ్రులు సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.2 లక్షలకు మంచి ఉండరాదన్నారు. విద్యార్థిని విద్యార్థులు, టీఎస్‌ఈపాస్.జీవోవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి పి యాదయ్య బుధవారం తెలిపారు.

# మహాలక్ష్మికి తుక్కు బస్సులే దిక్కు

షెడ్డుకు పోయే బస్సులన్నీ నగర రోడ్లమీదకు

ఓవర్ లోడ్‌తో మధ్యలోనే నిలిచిపోతున్న వైనం



**అవసరమైనది 4వేలు.. ఉన్నది 2700 బస్సులే**

- అందులోనూ 1300 తుక్కుబస్సులు
- కొత్తగా కావాల్సింది మొత్తం 2600
- కాలం చెల్లిన బస్సులతో అవస్థలు పడుతున్న మహిళలు
- కొత్త బస్సుల ఊసెత్తని రాష్ట్ర సర్కారు

సిటీబ్యూరో, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) :గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సిటీ బస్సులు మహిళలకు నరకం చూపుతున్నాయి. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాన్ని అమల్లోకి తీసుకురావడంతో మహిళా ప్రయాణికులకు అవస్థలు మొదలయ్యాయి. ఈ పథకం అమల్లోకి వచ్చిన తర్వాత సుమారు వెయ్యికి పైగా కాలం చెల్లిన సిటీ బస్సులను రోడ్డెక్కించారు. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

### నాలుగువేల సిటీ బస్సులు అవసరం

నగరంలో కొత్తగా అమల్లోకి వచ్చిన ఉచిత బస్సు ప్రయాణం కోసం నగర ప్రజలు పెద్ద సంఖ్యలో ముందుకు వస్తున్నారు. గతంలో ఆటోలు, సొంత వాహనాలు, ఇతర ప్రత్యామ్నాయ రవాణా సదుపాయాలతో ప్రయాణం చేసే వారంతా ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఒక్క సారిగా సిటీ బస్సులు పూర్తి స్థాయిలో నిండుతున్నాయి. నగరంలో మొత్తం 29 డిపోలు ఉండగా వాటిలో మూడు నుంచి నాలుగు డిపోలకు చెందిన బస్సులలో వంద శాతానికి మించి ఆక్యుపెన్సీ నమోదవుతుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలోనే మహాలక్ష్మి పథకాన్ని నగరంలో సమర్థవంతంగా అమలు చేయాలంటే.. ఇప్పుడున్న బస్సులు ఏ మాత్రం సరిపోవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో నగర ప్రయాణికుల అవసరాల కోసం దాదాపు 4000 సిటీ బస్సుల అవసరం ఉంటుందన్న అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం తిరుగుతున్న 2700 బస్సులలో వెయ్యి వరకు కాలం చెల్లిన తుక్కు బస్సులే ఉండగా.. నగర ప్రయాణికుల అవసరాల కోసం మరో 1300 కొత్త బస్సులు అవసరం ఉన్నదని అధికారులు పేర్కొంటున్నారు.

### మహాలక్ష్మికి బస్సులు కరువు

మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత.. ఆర్టీసీ బస్సులకు మంచి ఆదరణ పెరిగింది. కానీ ఉచిత ప్రయాణం కోసం వచ్చే మహిళా ప్రయాణికులను దృష్టిలో పెట్టుకుని నగరంలో ఆదనంగా సిటీ బస్సులను ఏర్పాటు చేయడం లేదు. ఈ పథకం అమలు చేయకముందు వరకు మొత్తం 2700 బస్సులు అందుబాటులో ఉండగా.. అందులో 1000 వరకు మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు కాగా.. 1700 వరకు ఆర్డినరీ బస్సులు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే ఇందులో దాదాపు 1300 సిటీ బస్సులు కాలం చెల్లినవిగా అధికారులు పేర్కొంటున్నారు. 15 సంవత్సరాలు దాటిన బస్సులను నిబంధనల ప్రకారం తక్కుగా పరిగణించి షెడ్డుకు పంపిస్తారు. కానీ వీటితోనే ఆర్టీసీ కాలం వెల్లదీస్తుండగా.. వీటితో ప్రమాదం పొంచిఉన్నదని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

## పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేయాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబర్ 20 : పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ జిల్లా కలెక్టర్లు, రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నామని వివరించారు. 2024 జనవరి 1వ తేది నాటికి 18ఏండ్లు నిండిన వారందరు ఓటరుగా పేరు నమోదు చేసుకునేలా విస్తృత ప్రచారం చేస్తున్నామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లతో పాటు నిబంధనలకు అనుగుణంగా అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఎల్‌ఐసీ కార్యాలయంలో మధ్యాహ్న భోజన విరామసమయంలో తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

## ఎల్‌ఐసీలో వేతన సవరణ చేపట్టాలి

- భోజన విరామ సమయంలో ఉద్యోగులు ఆదోళన

సిటీబ్యూరో, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఎల్‌ఐసీ ఉద్యోగులకు వేతన సవరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎల్‌ఐసీ క్లాస్ వన్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు బుధవారం భోజన విరామ సమయంలో ఆందోళన నిర్వహించారు. బ్యాంకింగ్ రంగంలో వేతన సవరణ దాదాపు పూర్తికాగా, ఎల్‌ఐసీలో మాత్రం అకారణంగా వాయిదా వేశారు. దీనిపై సంస్థ వేతన సవరణకు సంబంధించిన సంప్రదింపులు వెంటనే మొదలు పెట్టాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా నూతన పెన్షన్ విధానంలో ప్రస్తుతం 10శాతం మాత్రమే ఉన్న మేనేజ్‌మెంట్ కాంట్రిబ్యూషన్ 14 శాతానికి పెంచాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ఎల్‌ఐసీలో ఇప్పటి వరకు అమలు జరుగలేదని, అన్ని కేడర్‌లలో తగినన్ని నియామకాలు వెంటనే చేపట్టాలి, ఉద్యోగులు, అధికారుల సమస్యలపై యాజమాన్యపు ఏకపక్ష నిర్ణయాలు సరైనవి కావని, వాటిని వ్యతిరేకిస్తున్నామని, న్యాయపరమైన తమ డిమాండ్లను పరిష్కరించాలని ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి జి.తిరుపతయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఐసీ అధికారులు పాల్గొన్నారు.